## ఉత్తర - కతకుడు

మనిషి గాడిదలా ఎదిగాడు. అయితే ఓ అంటే నా రాదు. అతని తల్లి భోరు భోరున ఏడ్చింది. ఆ అయ్య కాళ్ళు, ఈ అయ్య వేళ్ళు పట్టుకుంది -

"వాడెందుకు పనికొస్తాడు? మిలట్రీలో భర్తీ చేయించు" - అని చెప్పారు కొందరు.

"అబ్బో అంత దూరమెలా పంపగలను? నా కాకి నాదగ్గరే ఉండాలి. ఎంతైనా తల్లిని కదా బాబూ" అని చెబుతూ వచ్చింది.

"ఏ A. K పార్టీసెవనో, ఫిఫ్టీసిక్సో పట్టుకుని, కళ్ళు మూసుకుని ఏ తిరుగుబాటు సంస్థలో చేరినా దొరలా బతుకుతాడు వాడికేమిటి?" - అన్నారు మరికొందరు.

"అమ్మో. ఎందులో చేరినా పోలీసులు వూరుకోరట గదా నాయినా? వాడు ఎన్‌కౌంటరయి పోతే నాగతేం గానూ?" - అని భయపడిందావిడ.

"అరే భలే ఐడియా - అసలు పోలీసుల్లోనే భర్తి చేస్తే ధోకా ఉండదు." అని చెప్పాడో శ్రేయోభిలాషి. చొరవ తీసుకుని చేర్పించాడు కూడా.

మనిషి పోలీసుల్లో చేరాడు - చదువుకున్న ఓనమాలు కేసులు బుక్ చేయడానికి పనికొచ్చాయి. గబగబా మెట్లెక్కి పెద్దకుర్చీ చేరుకోవాలంటే, చదువు అవసరమని తెలిసింది. చదువుకొనడం ఎలా చదువు - కొనడం ఎలా అని ప్రశ్నించుకుంటూ వుండగా హెడ్ కానిస్టేబుల్ విన్నాడు.

"బాడ్కావ్ అదిగూడ తెల్వదా? ఫో - ఓపెన్ ఊనివర్సిటీ ఉందిగదా?" - అన్నాడు. చెప్పాపెట్టకుండా మనిషి ఊరొదలి అడవిలో పడ్డాడు. అంతా ఓపెన్‌గావున్న స్థలం చూసి, ఏమీ కన బడక "ఓ ఊనివర్సిటీ నువ్వెక్కడ?" అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. పైన ఆకాశం ఫెళఫెళ మంది. కింద ఏటి నీరు కళవెళ మంది. వెనకనుండి నవ్వు వినిపించింది-

స్వాములవారొకరు గోచిగుడ్డ ఉతుక్కుంటున్నారు. మనిషి అతని దగ్గరికి పోయి అడిగాడు. "స్వామీ! ఓపెన్ ఊనివర్సిటీ ఎక్కడ? నాకింత చదువు కావాలి!"

"నీవొక అమాయకుడిలా వుంటివేమి నాయనా? విశ్వ విద్యాలయముల యందు చదువు దొరుకునని ఇంకనూ భ్రమించు చుంటివా? బంద్‌లు, బాయ్‌కాట్‌లు, డిమాండ్‌లు, అరెస్టులు, ఘెరా వ్‌లు, డౌన్‌డౌన్‌లు.... అదియొక రాజకీయ విషవృత్తమాయె గదా నాయనా? నీకిక టి. వి. పాఠములే శరణ్యము. వెళ్ళి చూసుకో నాయనా - శీఘ్రమేవ టి. వీ. ప్రాప్తిరస్తు...." అన్నాడుస్వామి.

"చిత్తం స్వామి! అట్లాగే. అయితే ఊరిబయట నువ్విక్కడ ఎందుకు స్వామీ? రా నాతోని. నేనే పోలీసోణ్ణయితి. నన్ను పట్టుకునే దెవడూ? బగర్ ఖందిల్, డబుల్ సవారీ నా సైకిల్ మీదనే తీస్క పోత - పా" అని మనిషి తొందర పెట్టాడు.

స్వాములవారు గద్గద స్వరంతో ఇలా చెప్పారు. "నేనొక శాపగ్రస్తుడను నాయనా. పూర్వాశ్రమమున తెలుగు టి. వీ డైరెక్టరు డను. దొడ్డి దారిన గడ్డి కరిచితిని. ప్రజలు నాపై కోపగించిరి. నేను ప్రసారము చేసిన సీరియళ్ళ ఫిలిం రీళ్ళన్నియు నా మెడకు చుట్టి, ఊరిబయట ఈ తటాకమున బడవేసిరి. అదియొక వింత అనుభవము! అదియును మాకు మేలైనదిలే. మా ఈ అనుభవమునకు పరితపించక,

నా ఈ గాథనే యొక సీరియల్ చేయుబెట్లని తపసు చేయుచుంటిమి. సహస్ర స్క్రిప్టార్చన ప్రారంభించితిమి నాయనా." - అని స్వాములు బుడుంగుమని నీటిలో మునిగి లేచాడు.

కొంత కాలం గడిచింది. వీలుదొరికినప్పుడల్లా మనిషి స్వాముల సేవ చేసుకుంటున్నాడు. "టి. వి.లో వచ్చే పాఠాలు అర్థమే అవుతలేవు, స్వామీ! మీరేనాకు సమయం కేటాయించాలె. పాటాలు చెప్పాలె." - అని ప్రార్థించాడు పోలీసు మనిషి.

స్వామి డైరెక్టరానంద విలాసంగా నవ్వాడు - "ఆ రోజులలో మేము ఉత్తర భారతమునకేగి ఒక మారుమూల విశ్వవిద్యాలయ మందు మా పట్టమును ఐదువేలకు బేరమాడి తెచ్చుకుంటిమి. నీకునూ ఆ శక్తి సామర్థ్యములు ఉన్నయెడల చెప్పుము."

"పైసల ముచ్చట చెప్పకు స్వామీ. గుండె దడదడ మంటు న్నది. జీతం ఇంట్లకే సరిపోదాయె. నెంబర్ ప్లేట్ కేసులు, హెల్మెట్ కేసులు, చోరీ కేసులు, లారీకేసులు, సారాకేసులు, ఒకటా? అన్నిటికి అన్నీ మా ఇనిస్పెక్టర్‌లే కొట్కొని తింటున్నరు. మా అసోంటి కింది పోలీసులకు ఇరానీ చాయ్, బన్ను తప్ప పైసల్ దొర్కయ్! - కష్ట పడి సదువుతా. నువ్వు పాటాలు చెప్పు." అర్థించాడు పోలీస్ మనిషి. పట్టుదలగా చదివాడు. ఒక పేపరు, అరపేపరూ రాస్తూ డిగ్రీ పదే ళ్ళకు పూర్తిచేశాడు. డిగ్రీహోల్డరని పోలీస్ డిపార్టుమెంట్‌వారు మని షిని ట్రెయినింగ్‌కి పంపారు.

ట్రెయినింగ్ మిషన్‌లో తిప్పి తిప్పి, దయ, జాలి, కరుణ, మాన వత్వం వగైరాలన్నీ కడిగేసి చిన్న పోలీసును పెద్దపోలీసు చేశారు. పళ్ళూడగొట్టినట్టు సహనాన్ని వూడగొట్టారు. మనిషిలో మానవ తత్వం లేకుండా, మనుషులను వేటాడే ప్రవృత్తిని పెంచారు.

రాజకీయ బలం, అధికారం, అండదండలు తోడు నిలువగా పెద్ద పోలీసు చాలా పెద్ద పోలీసయ్యాడు. అధికారానికి అనువుగా

విచ్చలవిడిగా పరిపాలించాడు. ఉద్యమాల్ని అణిచాడు. తిరుగుబాట్లను తొలిచాడు. లాకప్‌డెత్‌లు, ఎన్‌కౌంటర్లు ఆయన హయాంలో బ్రాందీ, విస్కీలు తాగినంత సుళువై పొయ్యాయి.

నిస్వార్థంగా చేస్తున్న సేవలకు ఆయనకు 'జనకింకర' పోలీస్ మెడల్ తప్పక వస్తుందని డిపార్ట్‌మెంటంతా గుప్పుమంది. పోలీస్ మనిషి మీసాలు దువ్వుకున్నాడు. తనది క్లీన్‌షేవని అతనికి ముందే తెలుసు. మెడల్ ప్రకటించే రోజు రానే వచ్చింది. పెద్ద పోలీస్‌కు "ఉత్తమ కతకుడి" మెడల్ ప్రకటించారు. అంతా ఆశ్చర్యపోయారు. ఎక్కడో పొరపాటు జరిగిందనుకున్నారు.

పొరపాటు జరగలేదని, మెడల్ సరిగానే ప్రకటించబడిందని మరో ప్రకటన కూడా వెలువడింది. మతకలహాలు, కిడ్నాపులు, హత్యలు, ఎన్‌కౌంటర్లు, పోలీస్ స్టేషన్లో రేప్‌లు వగైరా వగైరా జరిగినపుడు టి. వి. తెరమీద కనబడి మనోరంజకంగా, చక్కటి 'కతలు' చెప్పినందుకు ఈ పెద్ద పోలీసుకు ప్రత్యేకంగా ఈ మెడల్ ఇస్తున్నట్లు వివరణ కూడా వెలువడింది.

తనకు రావాల్సిన గుర్తింపు పోలీసువాడు ఎగరేసుకుపొయ్యాడని ఓ రచయిత బేర్‌బేర్ మన్నాడు. తన దగ్గర చేసిన శిష్యరికం వృథాగా పోలేదని, ఇంతితై వటుడింతై అన్నట్టు — ఓ అంటే నా రానివాడు ఎంత ఎత్తుకు ఎదిగిపోయాడని స్వామీ (మాజీ టి. వి.) డైరెక్టరానంద ఆనంద భాష్పాలు కార్చుకున్నాడు.

మనిషి జీవితంలో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో కతలు చెబుతూ బతుకుతూనే ఉన్నాడు. ●